

# వెన్నెలదీపాలు

## – డా.యండమూరి వీరేంద్రనాథ్

*(యండమూరి వీరేంద్రనాథ్ గారి రచనాశైలి గురించి పాఠకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చెప్పే అంశం ఏదైనా, మనసుకి హత్తుకునేలా, మనసుల్ని కదిలించేలా అక్షరరూపం ఇవ్వడం యండమూరిగారి ప్రతి రచనలోనూ స్పష్టంగా కన్పిస్తుంది. ఆయన వ్రాసిన 'విజయానికి ఆరో మెట్టు' పుస్తకంలోని చిన్న చిన్న సంఘటనలను ప్రతినెలా మీకందిస్తున్నాము. ప్రతి సంఘటనా ఏదో ఒక నిత్యజీవితసత్యంపై వెలుగులు ప్రసరింపచేస్తుంది.. అన్నీ కలిపి వెన్నెలదీపాల్లా మన మనసుల్ని వెలిగిస్తాయి. వీరేంద్రనాథగారి ప్రత్యేక అనుమతితో ఈ చిన్న కథలు కౌముది పాఠకులకోసం..)*

## (గత సంచిక తరువాయి)

### పగిలిన మొదటి బల్బ్

'ధైర్యం' అంటే తనపనిమీద తనకున్న నమ్మకమే. ఇరవై నాలుగుగంటలపాటు ఆరకుండా వెలిగే ఎలక్ట్రికల్ బల్బ్‌ని కనుక్కున్న థామస్ అల్వా ఎడిసన్, మొదటి బల్బ్ మీద ఆ ప్రయోగం విజయవంతంకాగానే, హర్షధ్వానాల మధ్య దాన్ని నౌకరుకిచ్చి, మేడమీద భద్రంగా దాచమని చెప్పాడు. చరిత్రపుటల్లో మ్యూజియంలో శాశ్వతంగా ఉండాల్సిన ఆ బల్బ్‌ని, టెన్షన్‌తో మెట్లెక్కుతూ నౌకరు పొరపాటున పడేసి బద్దలు కొట్టాడు.

ఏమాత్రం విసుక్కోకుండా ఎడిసన్ మళ్ళీ ఇరవైనాలుగు గంటలు పనిచేసి రెండో బల్బ్‌ని తయారుచేసాడు. తిరిగి అదే నౌకర్‌కి భద్రపరచమని ఇచ్చాడు.

ఇదే పుస్తకంలో ప్రస్తావించిన హెలెన్ కెల్లర్ (అంధురాలైన చెవిటిది)కు థామస్ అల్వా ఎడిసన్ ఫ్రెండ్, ఫిలాసఫర్. ఎడిసన్ ప్రసక్తి వచ్చింది కాబట్టి మరో సంగతి. ప్రపంచ ఖ్యాతి చెందిన ఎడిసన్, ఐన్‌స్టీన్, సర్ విన్‌స్టన్ చర్చిల్, హెన్రీఫోర్డ్, సర్ ఐజాక్ న్యూటన్.. అందరిలోనూ కామన్‌గా ఒక గుణం ఉంది. ఏమిటో తెలుసా? అందరూ స్కూల్ నుంచి వెళ్ళగొట్టబడినవారే.

### కవిసామ్రాట్ కదన కుతూహలం

కోపమూ ధైర్యమూ పక్కపక్కనే ఉంటాయనటానికి ఉదాహరణ అయిన విశ్వనాథ సత్యనారాయణగారి పేరు ఈ తరంవారికి అంతగా తెలియకపోవచ్చు. కవి సామ్రాట్ బిరుదాంకితులు, జ్ఞానపీఠ్ అవార్డ్ విజేత విశ్వనాథవారికి ఉన్నదున్నట్టు సూటిగా మాట్లాడటం, చురకలు వేయటం అలవాటు. కొందరికి ఆయన నిర్భయస్థుడు. ధైర్యవంతుడు. మరి కొందరికి కోపిష్టి.

ఆయన సుభాషితాలు మచ్చుకి కొన్ని:

చదువు రెండు విధాలు. ఒకటి గుమస్తాపని చేసేది, రెండవది రాజ్యాలేలేది. మొదటి చదువురాకుంటే, రెండోది తొందరగా వస్తుంది.

అసలీ విద్యాపద్ధతిలో గురువు చేయగలిగింది ఏమీలేదు. ఒక కృత్రిమ విద్యా పరిస్థితి గురుస్థానమాక్రమించుకుని గాడిదలనూ, గుర్రాలనూ ఒకచోట చేరుస్తోంది. (విశ్వనాథవారు తెలుగు లెక్చరర్‌గా కొంతకాలం పనిచేశారు.)

చంపండి, చీరండి, చెండాడండి అంటేనే సాహిత్యమా? ప్రతి తలకుమాసినవాడు "ఇది సాహిత్యం, ఇది సాహిత్యంకాదు" అంటూ వుంటే ఒప్పుకోవలసిందేనా?

నన్ను నీవు తిడుతున్నావంటే నన్ను చదువుతున్నావన్నమాట. నీకు తెలియకుండానే నన్ను మెచ్చుకుంటున్నావన్నమాట.

భయమంటే అజ్ఞానం. అజ్ఞానంలోంచి మొదట ఉత్పన్నమయ్యేది కోపం. మనసులోంచి 'సామరస్యం' వెళ్ళిపోతే ఎలా? మనసులో తొమ్మిది రసాలూ వుంటే, ఏ రసాన్ని ఆ రసంగా స్వీకరించగలగటం సామరస్యం.

శ్రీశ్రీ నన్ను 'ఆస్థాన విదూషకు'డినన్నాడు. ఒకప్పుడు అతడు అభ్యుదయకవి. ఇప్పుడు విరస కవి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఇచ్చిన 'ఫెలోషిప్పు'ని స్వీకరించి, తరువాత రాజీనామా ఇచ్చినాడు. వారిచ్చిన 5,000రూ బంగారు పతకం మాత్రం ఉంచుకున్నాడు. (కవిత్వము కొత్త మార్గాన వ్రాసినవాడు శ్రీశ్రీ- అని వేరేచోట ఆయనే పొగిడాడు.)

నా ధైర్యాన్ని అందరూ కోపం అంటారు. నాది అసహనం. ఛందస్సులేని కవుల్నీ, వర్చస్సులేని పండితుల్నీ చూస్తే అసహనం. అందుకే తిడుతూ వుంటాను.

***రెండు వరాలు***

ప్రేమ రెండు రకాలు. ప్రేమించటం, ప్రేమించబడటం. మహాత్మాగాంధీ నుంచీ నెల్సన్ మండేలా వరకూ ఎవ్వరైనా తీసుకోండి. ప్రేమించగలిగే వారే ప్రేమించబడతారు.

ప్రేమింపబడటానికి కొన్ని అర్హతలు కావాలి. ఒక్కోసారి ఏమీ అవసరంలేదు కూడా. అదే విధంగా ప్రేమించటానికి కూడా ఏమీ అవసరంలేదు. కానీ, ప్రేమని వెల్లడించటానికీ, ఫలింపచెయ్యటానికీ, నిలబెట్టుకోవటానికీ మాత్రం 'ధైర్యం'కావాలి.

ఒక స్త్రీకి కలలో దేవత కనపడి, "ఈ రెండు చేతుల్లో రెండు వరాలున్నాయి. ఒకటి: నీకు మనస్ఫూర్తిగా ప్రేమించే గుణం. రెండు: నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమించే యువకుడు. రెండింటిలో ఒకదాన్ని కోరుకో" అన్నదట. ఆ యువతి ఒక క్షణం ఆలోచించి, "మొదటిదే" అన్నదట. దేవత సంతోషించి, "సరిగ్గానే కోరుకున్నావు. నిన్నుప్రేమించే యువకుడిని కోరుకుని వుంటే, ఆ వరం ఇచ్చేసి మళ్ళీ నీ దగ్గరకు రాకపోదును. మొదటిది కోరుకున్నావు కాబట్టి ఈసారి నుంచీ రెండు వరాలూ ఒకే చేతిలో పెట్టుకుని తరచు వస్తాను" అందట.

***నిర్ణయం***

సమస్య అంటే - రెండు పరస్పర విరుద్ధమైన ఇష్టాలమధ్య ఒక నిర్ణయానికి రాలేకపోవటం, ఒక సమస్యని ఎదుర్కోవాలంటే స్టాప్ టెక్నిక్‌ని ఉపయోగించాలి.

See: సమస్యని నిర్వికార దృష్టితో చూడగలగటం.

Target: సరి అయిన చోట దాన్ని ఎదుర్కోగలగటం.

Organise: పరిష్కారానికి అన్నికోణాల్లో ఏర్పాట్లు చేసుకోవటం.

Plan: వ్యూహాన్ని అమలు జరపగలగటం.

ఒక పెద్ద ఎగ్జిక్యూటివ్ పోస్ట్‌కి జరిగిన ఇంటర్వ్యూలో అభ్యర్థిని ఈ విధంగా అడగటం జరిగింది.

1. ప్రస్తుతం ఒక ఇంటిని కొనాలంటే దాని ఖరీదు ఆరు లక్షలు.

2. నాలుగు సంవత్సరాల తరువాత దాని ధర ఎనిమిది లక్షలు అవుతుంది.

3. కొనటం కోసం అప్పుతీసుకుంటే 18శాతం వడ్డీ ఇవ్వాలి.

4. ప్రస్తుతం వున్న ఇంటికి పెడుతున్న అద్దె ఖర్చు నెలకి రూ.2,000.

ప్రశ్న: ఇల్లు ఇప్పుడు కొనటం మంచిదా? నాలుగైదు సంవత్సరాల తరువాతా?

ఈ లెక్కల్లో అభ్యర్థిని కేవలం ఆర్థిక పరమైన నిర్ణయాలు మాత్రమే తీసుకొమ్మని కోరటం జరిగింది. పదో తరగతి పైన చదివిన వారికి ఈ నిర్ణయం తీసుకోవటానికి అయిదు నిమిషాలకన్నా ఎక్కువ పట్టకూడదు.

### *పనిమీదే దృష్టి నిలుపు*

ఒక కుర్రవాడు (ఒక మైలు) పరుగు పందెంలో పాల్గొన్నాడు. మొత్తం ఆరు రౌండ్లు తిరగాలి. పందెం మొదలైంది. అతడు గాలికన్నా వేగంగా పరుగెడుతున్నాడు. అతడి దృష్టిలో గమ్యం ఒకటే కనపడుతోంది. తిరుగుతున్నాడు. ఒక రౌండు పూర్తిచేసాడు. రెండో రౌండు ఏకాగ్రత అంతా చేస్తున్న పనిమీదే నిలిపాడు. చివరి రౌండు గమ్యానికి చేరుకున్నాడు.

కానీ అతడికన్నా ముందు ఇంకా నలుగురు అప్పటికే గమ్యం వద్ద ఉన్నారు. అతడికి అమితమైన దుఃఖం కలిగింది.

జనం హర్షధ్వానాలు చేస్తున్నారు. నిర్వాహకుడు దగ్గరగా వచ్చి అభినందించటానికి చేయిసాచాడు. ఆ కుర్రవాడు అయోమయంగా "వారు నాకంటే ముందున్నారు" అన్నాడు.

నిర్వాహకుడు పరుగెడుతున్న వారివైపు చూసి నవ్వుతూ "వారింకా అయిదో రౌండులోనే వున్నారు" అన్నాడు.

పనిమీదే దృష్టిని నిలిపితే విజయం నీదే, ధనవంతుల పిల్లల్ని, జీవితాన్ని హాయిగా అనుభవిస్తున్న వారినీ చూసి నీ దురదృష్టానికి కృంగిపోకు. వారికన్నా ముందుంటావు. నువు చెయ్యవలసింది ఒక్కటే ఉత్సాహంగా పరుగెత్తటం.

### *జీవితపు వ్రాత*

భగవంతుడు తనని సృష్టిస్తున్నప్పుడు ఈ విధంగా అన్నాడు. ‘మనుగడ ఉన్నంతకాలం నువ్వు ఐదు విషయాలు గుర్తుపెట్టుకో. ‘ది బెస్ట్‘ అవుతావు‘ అంటూ ఐదు సూత్రాలు చెప్పాడు.

1) ఎప్పుడూ తెలివైనవాడి ఆలోచనల్లో భాగం పంచుకుంటూ, అతడితోనే ఉండు.

2) కొంచెం బాధాకరమైనా సరే, నిన్ను నువ్వు నిరంతరం చెక్కుకుంటూ, మరింత సూటిగా బ్రతకడానికి ప్రయత్నం చేయి.

3) నీ తప్పులు తుడిచి సరిదిద్దడానికి నీలోనే రబ్బరులాంటి ఒక పరికరం అమర్చుకో.

4) నువ్వు బయటకెలా కనపడుతున్నావన్నది ముఖ్యం కాదు. నీలోపల ఏమున్నదో అది ముఖ్యం అని తెలుసుకో.

5) నువ్వు ఎక్కడవున్నా సరే నీ తాలూకు ముద్రని అక్కడ వదిలిపెట్టు.

ఈ అయిదు సూత్రాలు అన్వయించుకున్నది కాబట్టే దశాబ్దాల నుంచి ఎన్ని నాగరికతలు మారినా ఎన్ని జెల్ పెన్నులు వచ్చినా, "పెన్సిల్" తన ఉనికి నిలుపుకుంటూనే వస్తోంది. ఇవే సూత్రాలు మనుషులకు కూడా వర్తిస్తాయి.

***నిజాయితీ***

నిజాయితీ అనేది భగవంతుడు మనిషికొక్కడికే ఇచ్చిన సంపద అంటే, అవసరమైనప్పుడు నిజాయితీగా తన బలహీనతలు చెప్పగలగటం. లాండ్ స్టేట్ యూనివర్శిటీ వాళ్ళు మానవ వనరుల విభాగంలో 1980లో చిన్న ప్రయోగం చేసారు. డేవిడ్, జాన్ అనే పట్టభద్రుల బయోడేటాని ఉద్యోగ నిమిత్తం వివిధ కంపెనీలకి పంపారు. ఇద్దరి తెలివి తేటలూ మిగతా అర్హతలూ అన్నీ సమానంగా ఉన్నాయి. జాన్ బయోడేటాలో "నాకు నచ్చని విషయం ఏదైనా జరిగినప్పుడు దాన్ని నేను వ్యతిరేకిస్తాను. వీలున్నంతవరకూ పోరాడతాను. అదే నా బలహీనత" అన్న వాక్యాన్ని చేర్చారు. డేవిడ్ కన్నా జాన్ కోసమే ఎక్కువ ఎంక్వయిరీలు వచ్చాయని వారు అన్నారు. మనిషి తన స్ట్రాంగ్ పాయింట్స్‌తో పాటు బలహీనతల్ని వెల్లడించినపుడే అతడిమీద ఇతర్లకి నమ్మకం పెరుగుతుంది అని ఆ రిపోర్టు తెలియజేసింది.

నిజమైన సంపద అంటే, పదిమంది ఆ పని చేస్తున్నా, మనసు (Conscious) వద్దని చెపితే, ఆ పని చేయకుండా ఉండగలగటం.

**రిస్క్ - ధైర్యం**

రిస్క్ తీసుకోలేక పోవడం వేరు, ధైర్యం వేరు. "పారేసిన చోటే వెతుక్కోవాలి" అన్న నానుడి ప్రతీ సందర్భంలోను సరైంది కాకపోవచ్చు. తనకి చేతకాని ఫీల్డులో చేతులు కాల్చుకున్న తర్వాత అక్కడ తాను మళ్ళీ గెలవలేని తెలుసుకున్నప్పుడు వెనుతిరగటం ఉత్తమం.

చేతకాని పౌరుషంతో అక్కడే పోరాడటం (ముఖ్యంగా వ్యాపారంలో) మూర్ఖత్వం.

ఇద్దరు సైనికాధిపతులు తమ సైన్యపు గొప్పల గురించి చెప్పుకుంటున్నారట. ఒక అధికారి తన సైనికుణ్ణి పిలిచి, ఒక భవంతిని చూపించి 'అక్కణ్ణుంచి దూకు' అన్నాట్ట. సైనికుడు మారు మాట్లాడకుండా దూకి కాలు విరగ్గొట్టుకున్నాడు. అప్పుడా సైన్యాధికారి "చూసావా అలా దూకటానికి నా సైనికులకు ఎంత ధైర్యం ఉందో" అన్నాడట.

రెండో సైనికాధికారి తన సైనికుణ్ణి పిలిచి "ఆ కొండమీదకెళ్ళి అక్కణ్ణుంచిదూకు" అన్నాట్ట. అప్పుడు ఆ సైనికుడు "మీకేమైనా మతి పోయిందా? అక్కణ్ణుంచి దూకితే ఛస్తాను" అన్నాట్ట. అప్పుడా సైనికాధికారి మొదటాయన వైపు తిరిగి, "చూసావా అలా మాట్లాడటానికి నా సైనికుడికి ఎంత ధైర్యం ఉందో" అన్నాడట. (ఒక ఇంగ్లీషు జోకు ఆధారంగా.)

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments